VC NEWS

# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ ఆదివారం 25 ఆగష్టు 2024

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 34




2లో

**వరంగల్ నగర**
అభివృద్ధికి మాస్టర్ ప్లాన్


PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


# హైదరాబాద్‌లో హైడ్రా దూకుడు



**చెరువు శిఖంలో కట్టిన ఎన్ కన్వెన్ష్ కూల్చివేత**

**అది పట్టాభూమి అంటూ నటుడు నాగార్జున వాదన**

**కోర్టుకు వెళతామని ప్రకటన...ఆక్రమదారుడిని కాదని వెల్లడి**



2లో

**ఎన్ కన్వెన్షన్ కూల్చివేతలపై స్టే హైకోర్టును ఆశ్రయించిన నటుడు నాగార్జున**



## ఉద్రిక్తంగా చలో ఆర్మూర్ భారీగా తరలివచ్చిన రైతులు

**నిజామాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి షరతులు లేకుండా రూ. 2 లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ.. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో రైతు ఐకాస ఆధ్వర్యంలో 'ఛలో ఆర్మూర్' కార్యక్రమం నిర్వహించారు. రైతు ఐకాస కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాకు ఆర్మూర్, బాల్కొండ, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాల నుంచి రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మామిడిపల్లి రోడ్డుపై బైఠాయించారు. ధర్నాకు బీఆర్ఎస్, బీజేపీ, వామపక్షాలు మద్దతు ప్రకటించాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కాంగ్రెస్ ఇచ్చిన మాటకు కట్టుబడి రూ. 2 లక్షల రుణమాఫీ చేయాలన్నారు. తక్షణమే ఎకరానికి రూ.7500 చొప్పున రైతు భరోసా నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మహాధర్నా నేపథ్యంలో ఆర్మూర్ పట్టణంలో పోలీసులు పెద్ద సంఖ్యలో మోహరించారు. దీంతో అక్కడ ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ధర్నా చేసేందుకు రైతులను అనుమతించలేదు. పరిష్మన్? లేకుండా రోడ్డుపై ధర్నా చేస్తే చర్యలు తీసుకుంటామని ఆదేశించారు. ఈ క్రమంలో బీఆర్ఎస్, బీజేపీ నాయకులను ముందస్తు అరెస్టులు చేశారు. రైతులు మామిడిపల్లికి రాకుండా ఎక్కడికక్కడ అడ్డుకుంటున్నారు. రేపటి వరకు ఆర్మూర్, బాల్కొండ సెగ్మెంట్లలో పోలీసులు ఆంక్షలు విధించారు.

రైతులందరూ పంక్షన్ హాల్?లో సమావేశమయ్యారు. అనంతరం పోలీసులు ధర్నా చేసేందుకు అనుమతి ఇచ్చారు.

## ఆక్రమణ కూల్చివేతలకే హైడ్రా ఏర్పాటు

**పదేళ్ల కాలంలో ఆక్రమణలపై దృష్టి పెట్టాం**

**ప్రజలు ఆక్రమణల కూల్చివేతలను హర్షిస్తున్నారు**

**ఎన్ కన్వెన్షన్ కూల్చివేతపై డిప్యూటీ సీఎం భట్టి**

న్యూఢిల్లీ: హైదరాబాద్‌లో హైడ్రా కూల్చివేతలను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమర్థించారు. గత కొన్నేళ్లుగా రాజధానిలో చెరువులను, ప్రభుత్వ స్థలాలను కబ్జాలు చేసి అక్రమ నరి÷-మాణాలు చేప్టారని అన్నారు. వీటిని కూల్చేయడం సరైందేనని అంటూ..ఎన్ కన్వెన్షన్ కూల్చివేతపై స్పందించారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ...హైదరాబాద్ నగరం అంటేనే లేక్స్, రాక్స్ అని.. వీటిని కాపాడుకోవాలంటూ పర్యావరణవేత్తలు పెద్ద ఎత్తున ఆందోళనలు కూడా చేశారన్నారు. చెరువులను ఆక్రమించి నిర్మాణాలు చేయడం వల్ల ఇబ్బందులు కలుగుతున్నాయని తెలిపారు. చెరువులు ఏవీ ఆక్రమణకు గురికాకుండా పరిరక్షించడం కోసం ఏర్పాటు చేసిందే హైడ్రా అని చెప్పుకొచ్చారు. దీన్ని ప్రజలందరూ ఆహ్వానిస్తున్నారన్నారు. ప్రతి పనికి నోటీసులు ఇచ్చి ఆపై చర్యలు తీసుకుంటున్నారన్నారు. బఫర్ జోన్‌లో కాదు, నేరుగా చెరువులోనే కట్టిన నిర్మాణాలను కూల్చేస్తున్నారన్నారు. సాటిలైట్ ఫోటోల ద్వారా విభజనకు ముందు, విభజన తర్వాత ఈ 10 ఏళ్లలో చెరువులు ఎంత మేర ఆక్రమణకు గురయ్యాయి తెలుసుకుంటున్నామని తెలిపారు. రిమోట్ సెన్సింగ్ సాటిలైట్ ఫోటోలను తీసి, అంతకుముందు ఎన్ని చెరువులు ఉండేవి, ఇప్పుడు ఎన్ని ఉన్నాయి అన్నది ప్రజల ముందు పెడతామన్నారు. చట్ట ప్రకారం, చట్టానికి లోబడి మాత్రమే చర్యలు చేపడతున్నామన్నారు.

అన్నీ లెక్కలతో సహా ప్రజల ముందు పెడతామన్నారు. ప్రజల ఆస్తులను కాపాడడం ప్రభుత్వ బాధ్యత అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు.



## శ్రీరామసాగర్ ప్రాజెక్టుకు భారీగా వరద

నిజామాబాద్: శ్రీరామసాగర్ ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో వర్షాలు కురవడంతో ప్రాజెక్టులోకి 29వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 1091 అడుగులు 90 టిఎంసిలు ఉండగా శనివారం సాయంత్రం వరకు 1082.3 అడుగులు 51.659 టిఎంసిలుగా ఉందని ప్రాజెక్టు ఏఈఈ రవి తెలిపారు. ఆయకట్టు పంటల సాగుకు కాలువల ద్వారా నీటిని విడుదల చేస్తున్నామని తెలిపారు.ప్రాజెక్టు నుండి ప్రధాన కాలువ కాకతీయకు 3000 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 50 క్యూసెక్కులు, మంచినీటి అవసరాలకు 231 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 541 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నామన్నారు.

# వైద్యరంగగాన్ని భ్రష్టు పట్టించిన కాంగ్రెస్ ప్రభుత్వం

**బిఆర్ఎస్ పాలనలో అద్భుతంగా అభివృద్ధి చేశాం ఎమ్మెల్యే హరీష్ రావు వెల్లడి**

**హైదరాబాద్:** బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ వైద్య రంగం ఉన్నత శిఖరాలకు చేరిందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. దేశానికే ఆదర్శంగా నిలిచిందని అన్నారు. అనేక విప్లవాత్మక పథకాలకు, తెలంగాణ రాష్ట్రం శ్రీకారం చుట్టి విజయవంతంగా అమలు చేసిందని తెలిపారు.

నిర్దిష్టమైన ప్రణాళిక, పటిష్టమైన చర్యలతో వైద్యరంగంలో అట్టడుగున ఉన్న తెలంగాణను దేశంలోనే అగ్రస్థానంలో నిలిపిందని హరీశ్‌రావు అన్నారు. కానీ ఈ తొమ్మిది నెలల కాంగ్రెస్ పాలనలో వైద్య, ఆరోగ్య రంగం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని తెలిపారు. కాంగ్రెస్ పాలన పుణ్యమా అని మళ్లీ.. 'నేను రాను బిడ్డ సర్కారు దవాఖానానకు' అనే రోజులు పునరావృతం అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో వైద్య ఆరోగ్య శాఖ నిర్లక్ష్యం పేద ప్రజలకు శాపంగా మారిందని హరీశ్‌రావు అన్నారు. బీ ఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హాస్పటల్స్ ఘనతను చాటేలా వార్తలు వస్తే, కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఆసుపత్రుల అధ్వాన్న పరిస్థితుల గురించి రోజూ వార్తలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 'పడకేసిన ప్రజారోగ్యం, రోగుల మందులు ఎలుకల పాలు, కుర్చీలోనే గర్భిణీ డెలివరీ, ఒకే బెడ్ పై ముగ్గురికి ట్రీట్మెంట్' ఇవన్నీ ఈ ఒక్క రోజు పత్రికల్లో వైద్య ఆరోగ్యశాఖపై నిర్వాకంపై వచ్చిన వార్తా కథనాలు అని ప్రస్తావించారు. ప్రజారోగ్య సంరక్షణ పట్ల కాంగ్రెస్ ప్రభుత్వా నిర్లక్ష్య వైఖరికి ఇది నిదర్శనమని తెలిపారు.



వానాకాలం వస్తున్నప్పటికీ ముందస్తు చర్యలు తీసుకోకపోవడం ఆస్పత్రుల సన్నద్ధతపై సమీక్షలు నిర్వహించకపోవడం పారిశుధ్యాన్ని పట్టించుకోకపోవడం వల్ల మలేరియా, డెంగీ లాంటి సీజనల్ రోగాలు విజృంభిస్తున్నాయని హరీశ్‌రావు అన్నారు. పల్లె, పట్టణం అని తేడా లేకుండా వైరల్ ఫీవర్లతో ప్రతి ఇద్దరిలో ఒకరు బాధపడుతున్నారని.. ఆస్పత్రుల్లో పడకలు దొరకని పరిస్థితి ఏర్పడిందని అన్నారు. గడచిన నెలన్నర కాలంలో 5246 డెంగీ కేసులు నమోదయ్యాయని తెలిపారు. గత సంవత్సరంతో పోలిస్తే 36? డెంగీ కేసులు అధికంగా నమోదయ్యాయని అధికారిక లెక్కలు తెలుపుతున్నాయని అన్నారు. జ్వరాలతో ప్రజలు ప్రాణాలు కోల్పోయే పరిస్థితి వచ్చిందంటే రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి ఏం చేస్తున్నట్టు? అని మండిపడ్డారు.

మార్పు కావాలంటే కాంగ్రెస్ రావాలని ఊదరగొట్టిన కాంగ్రెస్ పార్టీ ఇపుడు ఏమని సమాధానం చెబుతుందని నిలదీశారు. మీకు రాజకీయాలపై ఉన్న శ్రద్ధ ప్రజారోగ్యంపై లేకపోవడం శోచనీయమని విమర్శించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం ఎంతోమంది కుటుంబాల్లో అంతులేని

దుఃఖాన్ని మిగిలించిందని అన్నారు. ఈ మరణాలు ముమ్మాటికీ ప్రభుత్వ హత్యలే అని స్పష్టం చేశారు. దీనికి కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యత వహించాలని అన్నారు. మరణించిన వారికి 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మొద్దు నిద్ర వీడాలంటే ఇంకా ఎన్ని ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే వైద్య ఆరోగ్యశాఖపై అత్యవసర సమీక్ష నిర్వహించాలని, ప్రజా ఆరోగ్యాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు.

# మహిళల పట్ల యధాలాపంగా వ్యాఖ్యలు


**ఇప్పటికే విచారం వ్యక్తం చేస్తూ ప్రకటన**

**మహిళా కమిషన్**

**ముందు హాజరైన కెటిఆర్**

**రాష్ట్రంలో మహిళల సమస్యలపై కమిషన్‌కు ఫిర్యాదు**

**రాఖీలు కట్టి పెద్ద మనసు చాటుకున్న మహిళా కమిషన్ సభ్యులు**



2లో

# చెరువుల ఆక్రమణలపై గతంలోనే హైకోర్టు తీర్పు

**మళ్లీ నాగార్జునకు స్టే ఎలా ఇస్తారు**

**జడ్జిలు దీనిపై పునరాలోచన చేయాలి**

**ఎన్ కన్వెన్షన్ కూల్చివేతపై 2014లోనే ఉత్తర్వులు**

**కెటిఆర్ హయాంలో అనేక చెరువులు మాయం**

**మెదక్ ఎంపి రఘునందన్ రావు సంచలన వ్యాఖ్యలు**



2లో

# ప్రజాస్వామ్యానికి సవాలుగా మావోయిస్టుల హింస

రాయ్‌పుర్: మావోయిస్టుల హింస ప్రజాస్వామ్యానికి సవాలుగా మారిందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. ఇప్పటివరకు 17 వేలమంది దీనికి బలయ్యారని తెలిపారు. ఈ నేపథ్యంలోనే నక్సల్స్ అంతానికి బలమైన, పకడ్బందీ వ్యూహం అవసరమన్నారు. ఈ అంశంపై ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పుర్‌లో శుక్రవారం నిర్వహించిన అంతర్రాష్ట్ర సమన్వయ సమావేశంలో కేంద్ర మంత్రి పాల్గొని మాట్లాడారు. ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్, ఒడిశా, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్రలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు. 2004-14 వ్యవధితో పోలిస్తే 2014-24 మధ్యకాలంలో నక్సల్స్ సంబంధిత ఘటనల్లో 53 శాతం తగ్గుదల నమోదైనట్లు కేంద్రమంత్రి తెలిపారు. 2026 మార్చి నాటికి వామపక్ష తీవ్రవాదం నుంచి దేశాన్ని విముక్తి చేస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేసేందుకు కేంద్రం కృషి చేస్తోందన్నారు. ఏకకాలంలో భద్రతా కార్యకలాపాలు, అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఎన్ఐఏ, ఈడీ వంటి కేంద్ర సంస్థలు మావోయిస్టు హింస నిర్మూలనకు కృషి చేస్తున్నాయని తెలిపారు.

# హైదరాబాద్‌లో హైడ్రా దూకుడు



**హైదరాబాద్:** హైడ్రా అధికారులు దూకుడుగా వ్యవహరిస్తున్నారు. అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్నారు. ఈ క్రమంలో మాదాపూర్‌లోని నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్‌ను హైడ్రా అధికారులు కూల్చివేశారు. ఇది అక్రమ కట్టడమని.. చెరువు స్థలంలో నిర్మించారంటూ ఫిర్యాదులు రావడంతో.. తెల్లవారుజామున.. అక్కడకి చేరుకుని... ఎన్ కన్వెన్షన్‌ను కూల్చివేశారు. నామరూపాలు లేకుండా... నిర్మాణాలను నేలమట్టం చేశారు. నోటీసులను గోడకు అంటించి.. వెంటనే కూల్చివేతలు ప్రారంభించారు. నిర్మాహకులకు కూల్చివేతలను అడ్డుకునే అవకాశం కూడా ఇవ్వలేదని తెలుస్తోంది. ముందస్తుగా నోటీసులు ఇచ్చి ఉంటే.. కోర్టుకు వెళ్లే స్టే తెచ్చుకునే అవకాశం ఉండేది. కానీ.. హైడ్రా అధికారులు ముందస్తు సమాచారం లేకుండా... ఎన్ కన్వెన్షన్‌ను కూల్చివేశారు. ఎన్ కన్వెన్షన్ సెంటర్..హైదరాబాద్ మాదాపూర్ సమీపంలోని తుమ్మిడికుంట ప్రాంతంలో ఉంది. ఇది టాలీవుడ్ హీరో అక్కినేని నాగార్జునకు చెందినది. 2010లో ఎన్.కన్వెన్షన్ సెంటర్ నిర్మించారు. ఈ ఎన్.కన్వెన్షన్ తుమ్మిడి చెరువును ఆనుకునే ఉంటుంది. తుమ్మిడి చెరువు స్థలాన్ని ఆక్రమించి ఎన్ కన్వెన్షన్ నిర్మించారని ఆరోపణలు ఉన్నాయి. చెరువుకు సంబంధించిన మూడు ఎకరాల 30 గుంటల భూమిని ఆక్రమించారు. ఇందులో రెండు ఎకరాలు బఫర్ జోన్ ఉండగా... మరో 1.12 ఎకరాలు ఫుల్ ట్యాంక్ లెవల్ చెరువు శిఖం కిందకు వస్తుంది. దీంతో పలు ఫిర్యాదులు వచ్చాయి. దీంతో తోణ చర్యలు తీసుకున్న హైడ్రా వెంటనే కూల్చివేతలకు ఆదేశం ఇచ్చింది. ఎన్ కన్వెన్షన్ కూల్చివేతపై సినీ హీరో నాగార్జున స్పందించారు. హైకోర్టు ఉత్తర్వులకు విరుద్ధంగా ఎన్ కన్వెన్షన్ కూల్చివేతలు బాధాకరమైన విషయమని పేర్కొన్నారు. అధికారులు చట్టవిరుద్ధంగా చేసిన చర్యలపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని, చట్టాన్ని ఉల్లంఘించేలా తాము ఎలాంటి చర్యలు చేపట్టలేదని, ఉదయం కూల్చివేతకు ముందు తమకు ఎలాంటి నోటీసులు ఇవ్వలేదని, కూల్చివేత కోసం గతంలో ఇచ్చిన అక్రమ నోటీసుపై కోర్టు స్టే ఇచ్చిందని తెలియజేశారు. కేసు కోర్టులో ఉన్నప్పుడు ఇలాంటి చర్యలకు పాల్పడడం సరికాదని, తప్పుడు సమాచారంతో చట్ట విరుద్ధంగా కూల్చివేశారని మండిపడ్డారు. తాను చట్టాన్ని గౌరవించే పౌరుడినని, కోర్టు తనకు వ్యతిరేకంగా తీర్పు ఇస్తే తానే కూల్చివేతను నిర్వహించేవాడినని, తాజా పరిణామాలతో ప్రజలకు తప్పుడు సంకేతం వెళ్లే అవకాశం ఉందన్నారు. దీంతో తాము అక్రమాలకు పాల్పడ్డామని ప్రజలకు తప్పుడు సంకేతాలు వెళ్తాయని నాగార్జున తన బాధను వ్యక్తం చేశారు. మాది పట్టాభూమి అని, ఒక్క అంగుళం కూడా ఆక్రమించలేదని, ప్రైవేటు స్థలంలోనే భవనం నిర్మించామని చెప్పారు. మాదాపూర్‌లోని ఎన్ కన్వెన్షన్ ను హైడ్రా అధికారులు కూల్చివేసిన ఘటనపై ఆయన వివరణ ఇచ్చుకున్నారు. హైడ్రా చట్టవిరుద్ధంగా వ్యవహరించిందంటూ వ్యాఖ్యానించారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా పోస్టు పెట్టారు. స్టే ఆర్డర్‌లు, కోర్టు కేసులకు విరుద్ధంగా ఎన్ కన్వెన్షన్‌కు సంబంధించి కూల్చివేతలు చేపట్టడం బాధాకరమని పేర్కొన్నారు. చట్టాన్ని ఉల్లంఘించేలా తాము ఎటువంటి చర్యలు చేపట్టలేదని, కొన్ని వాస్తవాలను తెలిపేందుకు ఈ ప్రకటన చేసినట్లు వెల్లడించారు. ఆ భూమి పట్టా భూమి. ఒక్క అంగుళం ట్యాంక్ ప్లాన్ కూడా ఆక్రమణకు గురికాలేదు. ప్రైవేట్ స్థలంలో నిర్మించిన భవనమిది. కూల్చివేత కోసం గతంలో ఇచ్చిన అక్రమ నోటీసుపై స్టే కూడా మంజూరు చేసింది. స్పష్టంగా చెప్పాలంటే, కూల్చివేత తప్పుడు సమాచారంతో లేదా చట్ట విరుద్ధంగా జరిగింది. అధికారులు చేసిన ఈ చట్ట విరుద్ధ చర్యలకు వ్యతిరేకంగా మేం న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాం. అక్కడ మాకు న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నానని నాగార్జున పేర్కొన్నారు.

# చెరువుల ఆక్రమణలపై గతంలోనే హైకోర్టు తీర్పు



హైదరాబాద్: పురపాలక శాఖ మంత్రిగా ఉన్నప్పుడు కేటీఆర్ చేసినన్ని తప్పులు ఎవరూ చేయలేదని భాజపా మెదక్ ఎంపీ రఘునందన్‌రావు దుయ్యబట్టారు. ఎన్ కన్వెన్షన్‌ను కూలగొట్టాలని హైకోర్టు 2014లోనే ఉత్తర్వులిచ్చిందని, కానీ, పదేళ్ల అధికారంలో ఉన్న భారాస కూలగొట్టలేదని అన్నారు. ఇందుకు దీనిని తొక్కి పెట్టారో కెటీఆర్ చెప్పాలన్నారు. కోర్టు ఆదేశాలను కూడా బేఖాతర్ చేశారని మండిపడ్డారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. చెరువులు ఎక్కడెక్కడ కబ్జా చేశారో పదేళ్ల అధికారంలో ఉన్న కేటీఆర్‌కు తెలియదా అని ప్రశ్నించారు. భారాస, కాంగ్రెస్ నేతలు పరస్పరం తిట్టుకుంటూ కాలం గడుపుతున్నారని విమర్శించారు. టాలీవుడ్ నటుడు అక్కినేని నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్‌ను హైడ్రా బృందం కూల్చివేసిన ఘటన ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో హాట్ టాపిక్ అయ్యింది. మూడున్నర ఎకరాలు తుమ్మిడి చెరువును కబ్జా చేసి కన్వెన్షన్‌ను నిర్మించారని అధికారులకు ఫిర్యాదులు రావడంతో రంగంలోకి దిగిన హైడ్రా నేలమట్టం చేసింది. ఈ క్రమంలో హైకోర్టునుఆశ్రయించడంతో నాగార్జునకు ఊరట లభించింది. ఎన్ కన్వెన్షన్ కూల్చివేతలపై తెలంగాణ హైకోర్టు స్టే విధించింది. కూల్చివేతలను ఆపేయాలని హైకోర్టు శనివారం నాడు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులపై బీజేపీ ఎంపీ రఘునందనరావు స్పందించారు. 'గౌరవ న్యాయ మూర్తులకు విజ్ఞప్తి.. లంచ్ మోషన్ అని.. ఆగం ఆగం కేసులు వినకండి. ఒక్క బిల్డింగ్ కూలిపోతే ఏమవుతుంది.. 2007, 2008లో చెరువుల కాపాడాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తీర్పు ఇచ్చింది. చెరువులో నిర్మాణాలు ఉంటే ఎలాంటి నోటిసులు ఇవ్వకుండా కూల్చాలని సుప్రీంకోర్టు చెప్పింది. మళ్ళీ జడ్జీలు స్టే ఇచ్చుడు ఏంది..? పిల్లలు నాలల కొట్టుకోపోతే ఏం చేశారు..?. డీ మార్కు చేసిన అనుమతులు లేకుండా కట్టిన నిర్మాణలను కూల్చివేయాలని హైకోర్టు చెప్పింది. ఒక్కసారి హైకోర్టు తీర్పు ఇచ్చిన తర్వాత మళ్ళీ హైకోర్టు జడ్జిలు చేయబడమేంటి..?. దయచేసి హైకోర్టు జడ్జిలు కూడా హైదరాబాద్ చెరువుల పరిరక్షణకు సహకరించాలని న్యాయస్థానానికి రఘునందనరావు విజ్ఞప్తి చేశారు. 'బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు డ్రామాలు రక్తికట్టించేలా మాట్లాడుతున్నారు. 1994కోట్ల విజయభాస్కర్ రెడ్డి హయాంలో మిరాలం చెరువు కబ్జాపై స్పందించారు. 2010 లో ఎఫ్టీఎల్, శిఖంలలో ఎవరు ఏం కట్టినా కూల్చివేయాలని కోర్టు చెప్పింది. 157జీవోను 6 /4 2010లో ప్రభుత్వం తీసుకుని వచ్చింది. 18మందితో లేక్ ప్రొటెక్షన్ కమిటీని ఏర్పాటు చేసింది. ఇప్పుడు మిరాలం ట్యాంక్ పరిస్థితి ఏంటో రేవంత్ రెడ్డి చెప్పాలన్నారు. ఎన్ కన్వెన్షన్‌ను 2014లో కూల్చివేయమని హైకోర్టు ఆదేశించింది. అప్పటి నుంచి ఎందుకు చర్యలు తీసుకోలేదో చెప్పాలి.. ఎన్ కన్వెన్షన్ వెనుక ఉన్న లాలూచీ ఏంటో కేటీఆర్ చెప్పాలి. కేటీఆర్ మున్సిపల్ శాఖ మంత్రిగా అధికారులతో కలిపి అధికారుల కమిటీ వేశారు. ముందు కేటీఆర్ జన్వాడా ఫాం హౌస్ కూల్చి వేయండి. కవిత, కేటీఆర్ ఫాం హౌస్‌ను కూల్చేందుకు ఎందుకు భయపడుతున్నారు. హైడ్రా వేసింది మంచి ఉద్దేశ్యంతో అయితే బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన కట్టడాలు కూల్చి వేయాలి. కబ్జాలను పాల్పడిన నేతలపై కేసులు పెడితే వారిని ఎందుకు అరెస్టు చేయలేదు. రాజ్ భవన్ రోడ్‌లో నాలాలపై ఆసుపత్రి కట్టారు.. భారీ భవనాలను నిర్మించారు. చెరువుల ఆక్రమణలపై చర్యలు తీసుకోని కేటీఆర్‌ను మొదటి ముద్దాయిగా అరెస్టు చేయాలని రఘునందన్ రావు డిమాండ్ చేశారు. ఆక్రమణలపై ఉక్కుపాదం మోపాలని, ఇందులో ఎవరికీ మినహాయింపు ఉండరాదన్నారు. ఈ విషయంలో చిత్తశుద్ధిని చాటాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

-----

# మహిళా కమిషన్ ముందు హాజరైన కేటీఆర్



హైదరాబాద్: తాను యథాలాపంగా చేసిన వ్యాఖ్యల పట్ల ఇప్పటికే విచారం వ్యక్తం చేశానని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలిపారు. మహిళా కమిషన్ ముందు విచారణకు హాజరైన అనంతరం ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ నేతలు కమిషన్ కార్యాలయం వద్దకు వచ్చి రాజకీయం చేశారన్నారు. భారాస మహిళా నేతలపై దాడి చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ అనుసరిస్తున్న వైఖరిపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నట్లు పేర్కొన్నారు. మహిళలను గౌరవించాలని విచారణకు వచ్చినట్లు తెలిపారు. రాష్ట్రంలోని సమస్యలను కమిషన్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులు, వసతి గృహాల్లో పిల్లల సమస్యలపై ప్రస్తావించినట్లు కేటీఆర్ తెలిపారు. అంతకుముందు విచారణ సందర్భంగా కేటీఆర్‌కు మహిళా కమిషన్ సభ్యులు రాఖీలు కట్టారు. మహిళలపై తాను చేసిన వ్యాఖ్యలకు వివరణ ఇచ్చేందుకు ఈరోజు మహిళ కమిషన్ ముందు కేటీఆర్ హాజరయ్యారు. వివరణ ఇచ్చేందుకని ఆయన వస్తే.. మహిళా కమిషన్ సభ్యులు పోటీలు పడి మరీ రాఖీలు కట్టడం ఒకింత ఆశ్చర్యంగా అనిపించింది. విచారణకు పిలిచి కేటీఆర్‌కు రాఖీ కట్టి సోదర అనుబంధాన్ని మహిళా కమిషన్ సభ్యులు చాటుకున్నారు. అనంతరం ఉచిత బస్సు ప్రయాణ విషయంలో మహిళలపై తాను చేసిన కామెంట్స్ యథాలాపంగా చేసినవేనని కేటీఆర్ వివరణ ఇచ్చారు. మహిళలంటే తనకు ఎంతో గౌరవం ఉందని చెప్పారు. రాష్ట్రంలో మహిళలపై ఇటీవల జరిగిన దాడులపై చర్యలు తీసుకోవాలని కేటీఆర్ కోరారు. నెల 15వ తేదీన తెలంగాణ భవన్‌లో స్టేషన్ ఘన్‌పూర్ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న కేటీఆర్.. కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంలో మంత్రి సీతక్క ఆర్టీసీ ఉచిత ప్రయాణంపై కొంతమంది చేసిన వ్యాఖ్యలకు కేటీఆర్ కౌంటర్ ఇచ్చారు. బస్సుల్లో మహిళలు బ్రేక్ డాన్స్, రికార్డింగ్ డాన్సులు చేసినా తాము ఏమంటామని అంటూ వ్యంగ్యంగా కేటీఆర్ మాట్లాడారు. ఈ వ్యాఖ్యలపై పెద్ద ఎత్తున రచ్చ జరిగింది. హిళలు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. కేటీఆర్ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ దిష్టిబొమ్మలను దగ్ధం చేశారు. మహిళల గురించి వివాదాస్పద కామెంట్స్ చేశారని మహిళా కమిషన్ సుమోటోగా స్వీకరించి నోటీస్ ఇచ్చింది. ఈ క్రమంలోనే ఇవాళ కేటీఆర్ మహిళ కమిషన్ ఎదుట హాజరై వివరణ ఇచ్చారు. అయితే ఈ వ్యాఖ్యలపై ఇప్పటికే ఆయన క్షమాపణ చెప్పారు.

# వయనాడ్ బాధితులకు సీతక్క పరామర్శ



**హైదరాబాద్:** ఆపదలో ఉన్నామంటే నేనున్నాంటూ ఆదుకునే మంత్రి సీతక్క మరోసారి తన మంచి మనస్సును చాటుకున్నారు. ఇటీవల ప్రకతి భీభత్సానికి అతలాకుతులమైన కేరళ రాష్ట్రంలోని వయనాడ్ బాధితులకు ఆమె ఆర్థిక సహాయం చేశారు. వయనాడ్ జిల్లాలో శనివారం మంత్రి సీతక్క పర్యటించారు. ములుగు జిల్లా డీసీసీ అధ్యక్షుడు పైడాకుల అశోక్‌తో కలిసి ఆమె ప్రభావిత ప్రాంతాలను

సందర్శించారు. ప్రకృతి ప్రకోపానికి గురైన వయనాడ్ బాధిత కుటుంబాలను ఆదుకోవడం కోసం ఆమె సేకరించిన రూ.20 లక్షల చెక్‌ను స్థానిక ఎమ్మెల్యే టి సిద్దికికి అందించారు. చెక్?తో పాటు దుస్తులు, నిత్యావసర వస్తువులను బాధితులకు అందజేశారు.కొండచరియల కింద పడి గుర్తు పట్టలేనంతగా మారిపోయిన వందల మృతదేహాలను సాముహిక ఖననం చేసిన ముండక్కై స్మశాన వాటికలో మృతులకు సీతక్క శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కొందరు మృతుల కుటుంబ సభ్యులతో మాట్లాడి వారిని ఓదార్చారు. కాగా, ఇటీవల వయనాడ్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో ప్రకృతి విలయతాండవం సృష్టించిన విషయం తెలిసిందే. భారీ వర్షాలు, వరదలు పలు ప్రాంతాలను ముంచెత్తగా.. కొండ చరియలు విరిగిపడి కొన్ని గ్రామాలకు గ్రామాలే నేలమట్టం అయ్యాయి. ఈ విషాద ఘటనలో దాదాపు 400 మందికి పైగా మృతి చెందగా.. వెయి మందికి పైగా గాయాలపాలయ్యారు. ప్రకృతి భీభత్సం వల్ల కొన్ని వందల కుటుంబాల గూళ్లు చెదిరిపోయాయి.

# ఎన్ కన్వెన్షన్ కూల్చివేతలపై స్టే

**హైదరాబాద్:** టాలీవుడ్ నటుడు నాగార్జుకు సంబంధించిన ఎన్ కన్వెన్షన్ కూల్చివేత వ్యవహారంలో బిగ్ ట్విస్ట్ చోటు చేసుకుంది. ఎన్ కన్వెన్షన్ కూల్చివేతలపై తెలంగాణ హైకోర్టు సింగిల్ బెంచ్ స్టే విధించింది. కూల్చివేతలను ఆపేయాలని హైకోర్టు శనివారం నాడు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. గండిపేట ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలోని అక్రమ నిర్మాణాలపై హైడ్రా కొరడా ఝుళిపిస్తోంది. అక్రమ కట్టాలను నేలమట్టం చేస్తోంది. ఈ క్రమంలోనే తమ్మిడి చెరువును ఆక్రమించి ఎన్ కన్వెన్షన్ సెంటర్‌ను నిర్మించారని ఆరోపణలు, ఫిర్యాదులు వెల్లువెత్తాయి. వీటిని పరిశీలించిన హైడ్రా.. శనివారం ఉదయాన్నే ఎన్ కన్వెన్షన్ సెంటర్‌ను నేలమట్టం చేసింది. అయితే, ఈ అంశంపై ఎన్ కన్వెన్షన్ సెంటర్ భాగస్వామ్య యజమాని అయిన అక్కినేని నాగార్జున తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. పట్టా భూమిలో కన్వెన్షన్ సెంటర్ నిర్మించామని, ఎలాంటి ఆక్రమణలకు పాల్పడలేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు హౌస్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు నాగార్జున. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా అక్రమంగా కూల్చివేతలు చేపట్టారని పిటిషన్‌లో పేర్కొన్నారు. 200 మంది పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేసి మరీ కూల్చివేశారన్నారు. 2014లో అప్పటి ఇరిగేషన్, జిహెచ్ఎంసి అధికారులు బిల్డింగ్‌ని కొలుస్తామని హెచ్చరించారని.. ఎఫ్‌టిఎల్‌లో బిల్డింగ్ ఉందని అప్పటి అధికారులు కూల్చేందుకు వచ్చారని గుర్తు చేశారు. అయితే, 2014లోనే హైకోర్టు ఎన్ కన్వెన్షన్ కూల్చివేతపై స్టే ఆర్డర్ ఇచ్చిందన్నారు. అప్పటికి ఇంకా ఎఫ్‌టిఎల్‌ను నోట్గి÷ చేయలేదు కాబట్టి కూల్చే ముందు నోటీసులు జారీ చేయాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసిందన్నారు.

# ఉద్రిక్తంగా చలో ఆర్మూర్

ఎకరానికి రూ.7500 చొప్పున రైతు భరోసా నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మహాధర్నా నేపథ్యంలో ఆర్మూర్ పట్టణంలో పోలీసులు పెద్ద సంఖ్యలో మోహరించారు. దీంతో అక్కడ ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ధర్నా చేసేందుకు రైతులను అనుమతించలేదు. పరిష్మన్? లేకుండా రోడ్డుపై ధర్నా చేస్తే చర్యలు తీసుకుంటామని ఆదేశించారు. ఈ క్రమంలో బీఆర్ఎస్, బీజేపీ నాయకులను ముందస్తు అరెస్టులు చేశారు. రైతులు మామిడిపల్లికి రాకుండా ఎక్కడికక్కడ అడ్డుకుంటున్నారు. రేపటి వరకు ఆర్మూర్, బాల్కొండ సెగ్మెంట్లలో పోలీసులు ఆంక్షలు విధించారు. రైతులందరూ పంక్షన్ హాల్?లో సమావేశమయ్యారు. అనంతరం పోలీసులు ధర్నా చేసేందుకు అనుమతి ఇచ్చారు.

# అవాస్తవాలు, అబద్ధాలు ..జగన్‌కు అలవాటే

**అనకాపల్లి:** అవాస్తవాలు, అబద్ధాలు చెప్పడం పులివెందుల ఎమ్మెల్యే జగన్మోహన్ రెడ్డికి వెన్నతో పెట్టిన విద్య అని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత వ్యాఖ్యలు చేశారు. శనివారం హోంమంత్రి మీడియాతో మాట్లాడుతూ.. బాబాయ్ వివేకానంద రెడ్డిని హత్య చేసిన వారిపై జగన్ ధర్నా చేయాలన్నారు. జగన్ మృతుల దగ్గరికి వెళ్లి నవ్వుతాడు, బాధితుల దగ్గరికి వెళ్లి సరదాలు చేస్తాడు అంటూ మండిపడ్డారు. ఎల్జి పాలిమర్స్ ఘటం జరిగినప్పుడు బాగా తీవ్రంగా గాయపడిన వారికి 20,000, పాక్షికంగా గాయపడిన వారికి 10000 ఇవ్వమని ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రకటించారని గుర్తుచేశారు. ఇప్పుడు పరిహారం గురించి జగన్ మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. పాలిమర్స్ ప్రమాదంలో 15 మంది మృతి చెందగా, ముగ్గురు మృతులకు ఇప్పటికీ కోటి రూపాయల పరిహారం అందలేదన్నారు. ఎసెన్షియ ప్రమాద ఘటన లో మృతి చెందిన 17 మంది మృతులకు, 36 మందికి క్షతగాత్రులకు ఆర్‌టీజీఎస్ ద్వారా డబ్బులు పంపడం జరిగిందన్నారు. పులివెందుల ఎమ్మెల్యే జగన్ తెలిసీతెలియకుండా శవాలు మీద పేలాలు ఏరుకున్నట్టు వ్యవహరించడం బాధాకరమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తూ ప్రమాద బాధితులకు న్యాయం చేశారన్నారు. ఎల్జి పాలిమర్స్ వద్ద వైసీపీ ప్రభుత్వం తీసుకున్న రూ.150 కోట్లు ఎవరి జేబిల్లోకి వెళ్లాయో చెప్పాలని డిమాండ్ చేశారు. ఒక పాఠశాలలో రూ.50 కోట్లతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటు చేస్తామని చెప్పిన జగన్ రెండు బోర్డులు తప్ప ఏమీ ఏర్పాటు చేయలేదన్నారు. రియాక్టర్లు పాడయినప్పుడు కంపెనీ యజమాన్యాలు స్పందించి సరి చేస్తే ప్రమాదాలు జరగవని చెప్పారు. ఒక్కొక్క రియాక్టర్‌కు పది లక్షలు నుంచి కోటి రూపాయలు ఖర్చవు తుందన్నారు. కంపెనీల్లో ప్రమాదాలు సంభవించేటప్పుడు అలారం కూడా మోగని పరిస్థితి ఉందన్నారు. కంపెనీల్లో ప్రమాదాలు పునరావృతం కాకుండా రాష్ట్రస్థాయిలో హైలెవెల్ కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు హోంమంత్రి అనిత పేర్కొన్నారు.

# ప్రపంచంలోనే అత్యుత్తమ నగరంగా అమరావతి

అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణంపై ఏపీ మంత్రి నారాయణ కీలక వ్యాఖ్యలు చేశారు.నాలుగేళ్లలోనే రాజధాని నిర్మాణానికి పూర్తి చేస్తామని ఏపీ మంత్రి నారాయణ చెప్పారు. డిసెంబర్ 1వ తేదీ నుంచి అమరావతి నిర్మాణ పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ప్రపంచంలోనే ఉత్తమ నగరంగా అమరావతి నిలుస్తుందని వెల్లడించారు. అభివృద్ధిని ఒక్కచోటే పరిమితం చేయడం తమ ప్రభుత్వం ఉద్దేశం కాదని మంత్రి నారాయణ తెలిపారు. రాజధానితో పాటు 26 జిల్లాలను కూడా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు.అమరావతి రాజధాని నిర్మాణానికి రూ.60వేల కోట్లు ఖర్చవుతుందని పేర్కొన్నారు. కృష్ణా జిల్లా కంకిపాడులో జరిగిన క్రెడాయ్ సౌత్ కాన్ 2024 కార్యక్రమానికి మంత్రి నారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాధ్యమైనంత తొందరగా రాజధాని నిర్మాణాన్ని పూర్తి చేస్తామని తెలిపారు. వచ్చే నెల మొదటివారంలో ఐఐటీ నిపుణుల కమిటీ నివేదిక అందుతుందని నారాయణ చెప్పారు. నివేదిక వచ్చిన తర్వాత కొత్తగా టెండర్లు పిలుస్తామని తెలిపారు. పాత టెండర్లను క్లోజ్ చేస్తున్నామని పేర్కొన్నారు. అమరావతి నిర్మాణం అంచనాలు పెరిగే అవకాశం ఉందన్నారు. గతంలో 41వేల కోట్లకు టెండర్లు పిలిచామని తెలిపారు. ఇప్పుడు 60వేల కోట్ల వరకు ఖర్చవుతుందని అంచనా వేశారు. సాధ్యమైనంత తొందరగా రాజధాని పనులు పూర్తిచేస్తామని స్పష్టత ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాజధాని అమరావతిపై ఏపీ సీఎం చంద్రబాబు ఫోకస్ పెట్టారు. అధికారం చేపట్టిన వెంటనే అమరావతిలో పర్యటించిన ఆయన.. రాజధాని నిర్మాణం దిశగా పలు కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఇప్పటికే అక్కడ జంగిల్ క్లియరెన్స్ పనులు కూడా చేపట్టారు.కృష్ణా జిల్లా కంకిపాడులో క్రెడాయ్ సౌత్ కాన్ -2024 ప్రారంభమైంది. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి బిల్డర్లు హాజరయ్యారు. సౌత్ కాన్‌కు ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ మంత్రి నారాయణ వచ్చారు. నిర్మాణ రంగం అభివృద్ధికి అధికారులతో సమీక్షిస్తున్నట్లు వెల్లడించారు. బిల్డర్లకు అనుమతుల కోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్ తీసుకొస్తామని తెలిపారు. మున్సిపల్ శాఖతో అన్ని శాఖల సాఫ్ట్‌వేర్‌లను అనుసంధిస్తామని పేర్కొన్నారు. సింగిల్ విండో అనుమతులకు ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. అమరావతితో పాటు అన్ని ప్రాంతాల అభివృద్ధి తమ లక్ష్యమని స్పష్టం చేశారు. అమరావతి రాజధాని నిర్మాణాన్ని సాధ్యమైనంత త్వరగా పూర్తి చేస్తామని తెలిపారు. ప్రపంచంలోనే ఉత్తమ నగరంగా అమరావతి నిలుస్తుందని వెల్లడించారు.

# వరంగల్ నగర అభివృద్ధికి మాస్టర్ ప్లాన్

హైదరాబాద్: వరంగల్ పట్టణాన్ని మరో నగరంగా తీర్చిదిద్దడానికి మాస్టర్ ప్లాన్ తక్షణమే సిద్ధం చేయాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం డా. బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో తన కార్యాలయ సమావేశ మందిరంలో కాకతీయ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (కుడా) అధికారులు, సంబంధిత శాఖల అధికారులతో వరంగల్ నగర అభివృద్ధి పై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, హైదరాబాద్ నగరం తర్వాత వరంగల్ పట్టణాన్ని విస్తృత పరచడానికి, పలు అభివృద్ధి పనులు చేపట్టాడానికి తగు మాస్టర్ ఎ÷-లాన్ సిద్ధం చేసేందుకు గతంలో సమావేశాలు నిర్వహించడం జరిగిందని మంత్రి తెలిపారు. గతంలో ఉన్న 2041 మాస్టర్ ప్లాన్ ను 2050 నాటి జనాభాను దృష్టిలో ఉంచుకొని పట్టణంలో అభివృద్ధి పనులు చేపట్టుటకు ప్రతిపాదనలు రూపొందించాలని ఆయన సూచించారు. ఇందుకు అవసరమైన భూముల సేకరణ చేపట్టాలని ఆయన అన్నారు. ఇప్పటి వరకు కన్‌స్టలెంట్లు తయారు చేసిన మాస్టర్ ప్లాన్ లను మంత్రి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పరిశీలించి, పలు సూచనలు చేశారు. సమావేశంలో మున్సిపల్ పరిపాలన ముఖ్య కార్యదర్శి దాన కిషోర్, రోడ్లు భవనాలు శాఖ ప్రత్యేక కార్యదర్శి హరిచందన, కుడా వైస్ చైర్మన్, కమీషనర్ అశ్విని, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ గౌతమ్, కుడా సీపీఓ అజిత్ రెడ్డి, కన్‌స్టలెంట్లు, అధికారులు పాల్గొన్నారు.

వేగుచుక్క
TELUGU DAILY NEWS
3
ఆదివారం 25 ఆగస్టు 2024



# తెలంగాణ సాహితీ ధ్రువతార దాశరథి.

## "సత్యశోధక్" ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య.



**వేగుచుక్క న్యూస్, సిరికొండ, ఆగస్టు 24:**

తెలంగాణ దార్శనికత, సాహిత్య మకుటంగా, సాహితీ నింగిలో ధ్రువతారగా దాశరథి రంగాచార్య నిలిచాడని సత్యశోధక్ పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటయోధుడు, సాహితివేత్త దాశరథి రంగాచార్య 96వ జయంతి సందర్భంగా శనివారం సత్యశోధక్ పాఠశాలలో ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య ఉపాధ్యాయులతో కలిసి దాశరథి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ, తెలంగాణ సాయుధ పోరాటంలో పెన్ను అనే గన్నుతో పోరాడిన సాహసి, నిజాం నిరంకుశత్వాన్ని, తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని తన రచనలతో ఎదిరించిన అభ్యుదయవాది దాశరథి అని అన్నారు. ప్రజల దుర్భర పరిస్థితులను, దారుణమైన బానిస బతుకుల గురించి తన 'చిల్లర దేవుళ్ళు' నవలలో వివరించారన్నారు. అమృతంగమయ మాధుర్యం చూపించాదడని, మాయ జలతారుతో మైమరిపించారని పేర్కొన్నారు. అప్పటి సమాజంలో ప్రజల బానిస బతుకుల స్థితిగతులను
మోదుగ పూలు నవలలో కళ్ళకు కట్టినట్లు చిత్రించాడని అన్నారు. వామపక్ష వాదిగా ప్రజల పక్షాన నిలిచిన దాశరథి, నూతన సమాజం నిర్మాణం కోసం తాపత్రయపడిన ఉద్యమశీలి అని కొనియాడారు. సాంస్కృతిక స్వేచ్ఛ కోసం, అస్తిత్వంకోసం, భూమికోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి అంతంకోసం, నిజాంపాలనను తుదముట్టించడం కోసం ఆనాటి అభ్యుదయ సమాజం ఎలాసంఘటితమై పోరాడిందో ఆ పోరాటపటిమ దాశరథి రచనల్లో కనిపిస్తోందన్నారు. మహనీయుల జీవిత ఇతి వృత్తాలను స్ఫూర్తిగా తీసుకొని, ఆదర్శప్రాయమైన ఆలోచనలతో శ్రమించి ఉన్నత స్థాయికి చేరే కలలకు మనం సోపానాలు కావలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి:**

పట్టణంలోని ఆర్చిడ్స్ పాఠశాలలో శనివారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ ఎస్ ఆర్ విద్యా సంస్థల ఛైర్మన్ డాక్టర్ ఎం. మారయ్య గౌడ్ ను పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్ కే విద్యా సంస్థల సిఇఓ జైపాల్ రెడ్డి, ఆర్చిడ్స్ పాఠశాల ప్రిన్సిపాల్, ఛైర్మన్ సిఎచ్. గోవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.







# అనన్య కుటుంబాన్ని

## పరామర్శించిన అర్బన్ ఎమ్మెల్యే.



**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, ఆగస్టు 24:**

ఆనంద్ నగర్ లో ఇటీవల మురుగు కాల్వలో పడి చనిపోయిన అనన్య కుటుంబాన్ని శనివారం అర్బన్ శాసనసభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ పరామర్శించారు. జరిగిన సంఘటనపై వివరాలు స్థానికులతో, అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో దన్ పాల్ మాట్లాడుతూ, జరిగిన విషాదసంఘటన చాలా బాధాకరమైందని, తాను ఎమ్మెల్యేగా గెలిచినప్పటినుండి మున్సిపల్ కమీషనర్, అధికారులకు పలుమార్లు చెప్పడం హెచ్చరించడం జరిగిందని అన్నారు. నగరంలో లోతట్టు ప్రాంతాలలో డ్రైనేజీ, రోడ్స్, నాలా కబ్జాల సంబంధిత సమస్యలపై దృష్టి పెట్టాలని సూచించిన, ఇప్పటివరకు పూర్తి స్థాయిలో పనులు జరగకపోవడం పై మండిపడ్డారు. మున్సిపల్ అధికారుల నిర్లక్షనికి నిండు ప్రాణం పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలో ఇప్పటికి కనీసం వీధి దీపాల కల్పనలో కూడా మునిసిపల్ శాఖ ఫెయిల్ అయ్యిందని, అధికారులు ఇప్పటికైనా చిత్తశుద్ధితో పనిచేయాలనీ, నిర్లక్ష్యం వహిస్తే తగిన చర్యలు తీసుకుంటాం అని హెచ్చరించారు. నగర సమస్యల పై జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని డ్రైనేజీ, రోడ్స్, వీధిదీపాల కల్పన వంటి కనీస మౌలిక సౌకర్యాలు కల్పించాలని కోరారు. అనన్య కుటుంబానికి పదివేల ఆర్థికసహాయం, నిత్యావసర సరుకులు అందించి, కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

# నలంద"లో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు.

## గోపిక, కృష్ణ వేషధారణలో విద్యార్థుల సంబరాలు.

## పాల్గొన్న పాఠశాల యాజమాన్యం ప్రసాద్, సాగర్.









**వేగుచుక్కన్యూస్, ఆర్మూర్, ఆగస్టు 24:**

పట్టణంలోని మామిడిపల్లిలో గల నలంద హైస్కూల్లో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. కృష్ణాష్టమి వేడుకలు పురస్కరించుకొని విద్యార్థులు గోపిక, కృష్ణ వేషధారణలో, ట్రెడిషనల్ దుస్తులలో పాల్గొని సంబరాలు జరుపుకున్నారు. మొదట శ్రీకృష్ణుని పూజ కార్యక్రమం తరువాత విద్యార్థిని, విద్యార్థులు గోపిక, కృష్ణ వేషధారణలో దాండియా ఆడుతూ కనువిందు చేశారు. అనంతరం కార్యక్రమంలో విద్యార్థి, విద్యార్థులు అందరూ ఉట్టి కొట్టే కార్యక్రమంలో సంతోషంగా, ఉత్సహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం ప్రసాద్, సాగర్ మాట్లాడుతూ, గత పది సంవత్సరాల నుండి శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు.

విద్యార్థుల్లో మన సంస్కృతి, సంప్రదాయాలు పెంపోందిచాడానికి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యంతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.













# హైకోర్టు న్యాయమూర్తులకు ఘన స్వాగతం.

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, ఆగస్టు 24 :**

రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సుజోయ్ పాల్, జె.శ్రీనివాస్ రావు శనివారం నిజామాబాద్ పర్యటనకు హాజరైన సందర్భంగా జిల్లా ఉన్నతాధికారులు వారికి ఘన స్వాగతం పలికారు. జిల్లా కోర్టు భవన సముదాయంలోని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కాన్ఫరెన్స్ హాల్ లో మూడు రోజుల పాటు కొనసాగిన కమ్యూనిటీ మీడియేటర్ల శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమానికి హైకోర్టు న్యాయమూర్తులు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ముందుగా వారు స్థానిక రోడ్లు భవనాల శాఖ అతిథి గృహం వద్దకు చేరుకుని, పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించారు. జిల్లా జడ్జి సునీత కుంచాల, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, ఆయా శాఖల జిల్లా అధికారులు, న్యాయ శాఖ అధికారులు, న్యాయవాదులు, బార్ అసోసియేషన్ ప్రతినిధులు హైకోర్టు జడ్జీలను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు. అనంతరం జిల్లా జడ్జి, కలెక్టర్ తో హైకోర్టు న్యాయమూర్తులు అతిథి గృహంలో కొద్దిసేపు భేటీ అయ్యారు.









# నూతన ఆర్ఓఆర్ ముసాయిదా బిల్లుపై చర్చా.

- అభిప్రాయాలను ప్రభుత్వానికి నివేదిస్తాం : కలెక్టర్ వెల్లడి.






**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, ఆగస్టు 24**

: ధరణి సమస్యల శాశ్వత పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన నూతన రెవెన్యూ చట్టం-2024 ముసాయిదాపై వివిధ వర్గాల వారి అభిప్రాయాలను సేకరించేందుకు వీలుగా శనివారం నిజామాబాద్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ప్రధాన సమావేశ మందిరంలో చర్చా వేదిక కొనసాగింది. జిల్లా పాలనాధికారి రాజీవ్ గాంధీ హనుమంతు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, మార్క్ ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డితో పాటు న్యాయవాదులు, రిటైర్డ్ రెవెన్యూ ఉద్యోగులు, రైతులు, రైతు సంఘాల ప్రతినిధులు హాజరై నూతన రెవెన్యూ చట్టంలోని ముసాయిదా అంశాలపై సలహాలు, సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, చర్చా వేదిక ద్వారా వెల్లడైన అందరి



అభిప్రాయాలను క్రోఢీకరించి ప్రభుత్వానికి పంపిస్తామని అన్నారు. ప్రభుత్వం ఇప్పటికే నూతన ఆర్.ఓ.ఆర్ ముసాయిదా బిల్లు-2024 పై ప్రజల నుంచి సీసీఎల్ఏ వెబ్సైట్ ద్వారా సూచనలు, సలహాలు స్వీకరించడం జరిగిందని గుర్తు చేశారు. జిల్లా స్థాయిలోనూ మేధావులు, రెవెన్యూ చట్టం పట్ల అవగాహన కలిగి ఉన్న వారి అభిప్రాయాలను తెలుసుకోవాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్చా వేదిక కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. రెవెన్యూ అధికారులు, ఉద్యోగులు సైతం తమ దైనందిన విధుల నిర్వహణ సందర్భంగా గమనించిన అంశాలను ప్రభుత్వం దృష్టికి తేవాలని సూచించారు. ఈ సందర్భంగా నూతన ముసాయిదా చట్టంలోని అంశాల గురించి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రమణ్ రెడ్డి తెలియజేశారు. ఎమ్మెల్యేలు ధన్పాల్ సూర్యనారాయణ, రాకేష్ రెడ్డిలు మాట్లాడుతూ, ప్రభుత్వం రూపొందించిన నూతన ముసాయిదా చట్టాన్ని స్వాగతిస్తున్నామని అన్నారు. అయితే, క్షేత్రస్థాయిలో చట్టాల అమలు పకడ్బందీగా జరగాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. చిన్న,సన్నకారు రైతులకు లబ్ధి చేకూరేలా, సత్వరమే వారి సమస్యలు పరిష్కారం అయ్యేలా నూతన చట్టం దోహదపడాలని ఆకాంక్షిస్తూ, ఈ దిశగా అధికారులందరూ అంకితభావంతో విధులు నిర్వర్తిస్తారనే ఆశాభావాన్ని వ్యక్తపర్చారు. గ్రామ స్థాయిలో రెవెన్యూ వ్యవస్థను పునరుద్ధరించాలని జిల్లా రెవెన్యూ అసోసియేషన్ ప్రతినిధులు , రిటైర్డ్ రెవెన్యూ ఉద్యోగులు, ఆయా మండలాల తహసీల్దార్లు తమ అభిప్రాయాలను వెల్లడించారు. భూ సంబంధిత అంశాలతో కూడిన సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రత్యేక ట్రిబ్యునల్ ను ఏర్పాటు చేసి, ఆర్డీఓలకు అప్పిలేట్ అథారిటీ అధికారం కల్పించాలని కోరారు. చర్చా వేదికకు హాజరైన రిటైర్డ్ రెవెన్యూ ఉద్యోగులకు, న్యాయవాదులకు, రెవెన్యూ అసోసియేషన్ ప్రతినిధులకు, రైతులకు కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. చర్చా వేదికలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, ట్రైనీ కలెక్టర్ సంకేత్, ఐడీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్ నాయక్, ఆర్డీఓలు రాజేంద్రకుమార్, అంబదాస్ రాజేశ్వర్, కలెక్టరేట్ ఏ.ఓ ప్రశాంత్ పాల్గొన్నారు.

# రాత్రికిరాత్రే ధనవంతుడి కావాలన్న కోరిక

**అప్పులు చేసిమార్కెట్లో నష్టపోయిన యువకుడు**

**సెల్ఫీ వీడియో తీసి ఆత్మహత్య**

**వేగుచుక్కన్యూస్, మంచిర్యాల:**జీవితంలో ఆర్థికంగా ఉన్నత స్థితికి ఎదగాలని ఆశించి మోసపోయాడో యువకుడు. మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్‌లోని ఓ యువకుడి విషయంలో సరిగ్గా ఇదే జరిగింది. తన కుటుంబాన్ని ఉన్నత స్థితిలో చూడాలనుకున్న అతని ఆశలు అడియాశలయ్యాయి. చివరికి.. కన్నవారికి, భార్యాబిడ్డకు దూరమై పుట్టెడు శోకాన్ని మిగిల్చాడు. ఆత్మహత్యకు పాల్పడే ముందు అతను తీసుకున్న సెల్ఫీ వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే అత్యాశతో తప్పటడుగులు వేసే ఎంతో మందికి ఈ వీడియో ఓ గుణపాఠం. మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అరుణక్క నగర్‌లో నివాసం ఉంటున్న శ్రీకాంత్ (29)కి భార్య, కుమారుడు, తల్లిదండ్రులు ఉన్నారు. తన కుటుంబం ఆర్థికంగా స్థిరపడాలని కలలుగన్నాడు. అందులో భాగంగా.. మూడేళ్ల నుంచి స్టాక్‌మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టడం ప్రారంభించాడు. మొదట్లో బాగానే లాభాలు ఆర్జించాడు. స్టాక్ మార్కెట్‌లో పట్టు సాధించానని ఫీలయ్యాడు. తండ్రి వద్ద రూ.2లక్షలు, స్నేహితుడి సోదరుడి వద్ద రూ.2లక్షలు.. ఇలా తెలిసిన వారి వద్ద రూ.లక్షల్లో అప్పులు చేశాడు. ఇవి కాక.. రుణయాప్‌ల ద్వారా మరికొంత లోన్ తీసుకుని స్టాక్స్‌లో పెట్టుబడి పెట్టాడు. ఆ డబ్బంతా పోయింది. అప్పుల వాళ్ల తాకిడి, లోన్ యాప్ నిర్వాహకుల బెదిరింపులు ఎక్కువయ్యాయి. పరువుగా బతికే కుటంబం.. అప్పులోళ్లు ఇంటికొచ్చి అడిగితే ఏమైనా ఉందా?. తల్లిదండ్రులకు, భార్య బిడ్డకు ముఖం చూపించగలనా? ఇలా తనలో తానే ఎంతో మథనపడ్డాడు. నీపై కేసు వేస్తా, ఇంటి కొచ్చి గొడవచేస్తాం అని లోన్‌యాప్ నిర్వాహకులు మెడపై కత్తిపెట్టినంత పనిచేశారు. దీంతో పరువుపోతుందని భయపడిన శ్రీకాంత్ ఆత్మహత్యే శరణ్యమని భావించాడు. ఆర్థికంగా ఎదగాలని ఆశపడిన తాను జీవితంలో ఓడిపోయానని, కుటుంబ పరువు తీయడం ఇష్టంలేక చనిపోతున్నానని సెల్ఫీ వీడియో తీసుకుని ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. డబ్బు
సంపాదించాలనే ఆశతో తాను స్టాక్ మార్కెట్‌లో ఎలా నష్టపోయింది, ఎవవెవరి దగ్గర ఎంత డబ్బులు తీసుకున్నది వీడియోలో వివరించాడు.

# తెలంగాణ వారసత్వ సంపదను వెలికి తియ్యాలి.

**టియు రిజిస్టర్ ఆచార్య ఎం. యాదగిరి.**

**ఘనంగా చర్చ వేదిక ప్రారంభం, పాల్గొన్న ప్రముఖులు.**














**వేగుచుక్క న్యూస్, దోమకొండ, ఆగస్టు 24:**

పరిశోధకులు తెలంగాణ వారసత్వ సంపదను వెలికి తియ్యాలని టియు రిజిస్టర్ ఆచార్య ఎం. యాదగిరి కోరారు. తెలంగాణ చరిత్ర , వారసత్వం అనే అంశంపై తెలంగాణ విశ్వవిద్యాలయం దక్షిణ ప్రాంగణం భాష సంస్కృతి, తెలంగాణ భాష, సంస్కృతి శాఖ మరియు దోమకొండ పోర్ట్ సంయుక్తంగా నిర్వహించిన చర్చ వేదిక కార్యక్రమం ను దోమకొండ గడికోటలో శనివారం ఘనంగా ప్రారంబించారు. తెలంగాణ విశ్వవిద్యాలయ రిజిస్టర్ ఆచార్య ఎం యాదగిరి, ఉస్మానియా విశ్వవిద్యాలయ ఆచార్యులు అడప సత్యనారాయణ, డాక్టర్ దేమి రాజిరెడ్డి, ప్రోగ్రాం డైరెక్టర్ సౌత్ క్యాంపస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ సుధాకర్ గౌడ్ తో ప్రారంభించారు. ఈ సందర్భంగా రిజిస్టర్ ఆచార్య ఎం.యాదగిరి మాట్లాడుతూ, తెలంగాణ చరిత్ర పూర్వకాలం నుండి ప్రస్తుత కాలం వరకు అనే అంశం యావత్తు విద్యార్థులు లోకానికి ఉపయోగపడుతుందని చరిత్ర అనేది ప్రతి అంశానికి సంబంధించిందని, ప్రతి సబ్జెక్టుకు చరిత్రయే అన్నిటికీ ఆధారమన్నారు. చరిత్ర తెలియని వ్యక్తి, చరిత్ర హీనుడిగా మిగులుతారని, విద్యార్థి జీవితం నుండి మనిషి జీవితం ఉన్నత స్థాయికి ఎదగాలంటే చరిత్ర తెలుసుకోవాలని సూచించారు.

**శాతవాహన కాలం గొప్పది: డాక్టర్ దేమీ రాజి రెడ్డి**

చర్చ వేదికలో భాగంగా డాక్టర్ దేమీ రాజి రెడ్డి శాతవాహన కాలం నాటి నాణాలు, ఆనాటి చరిత్ర ఆధారాలు అనే అంశంపై మాట్లాడుతూ, భారతదేశ చరిత్రలో శాతవాహన కాలంలో తెలంగాణకు గొప్ప చరిత్ర ఉందని కోటిలింగాల ను ఆధారంగా చేసుకుని భారత దేశంలోని మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, చత్తీస్గడ్ ఒడిస్సా, కర్ణాటక ప్రాంతాలను పరిపాలించారని అన్నారు. మొట్టమొదటిసారిగా భారతదేశ చరిత్రలో సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చిన ఘనత శాతవానులదే అని అన్నారు. శాతవానులు దేశంలోని బంగారు మరియు, వెండి, రాగి నాణాలు, వీరి నాణాలు ఏనుగు ముద్రతో ఉండేవని, వీరి చరిత్ర 2000 సంవత్సరాల క్రితం నాటిదని, అమరావతి, పనిగిరి, సాంచి వంటి ప్రముఖ కట్టడాలను నిర్మించారని, వీరి యొక్క చరిత్రను కొండాపూర్ మ్యూజియంలో కేంద్ర ప్రభుత్వం భద్రపరచిన చరిత్ర తెలుసుకోవచ్చు అన్నారు. తల్లికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారని, వారి పేరులో తల్లి పేరును చేర్చుకున్నారని, తెలంగాణ అభివృద్ధిలో వీరి యొక్క పాత్ర అమోఘమన్నారు

**తెలంగాణ రాష్ట్రంలోని సంస్థానాల పాత్ర : డాక్టర్ అనురాధ రెడ్డి**

సిర్నాపల్లి సంస్థానాధిపతి డాక్టర్ అనురాధ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలోని సంస్థానాల యొక్క పాత్ర అనే అంశంపై వివరిస్తూ బ్రిటిష్ నిజాం కాలంలో సంస్థానాలు ప్రజలకు ఏ విధంగా సేవలందించాయో వివరించారు. ప్రజలకు రవాణా సౌకర్యాలు, తాగునీటి కోసం చెరువులు, ఉపాధి కోసం అవకాశాలు కల్పించారాని అన్నారు. మరో ముఖ్య అతిథి ఉస్మానియా విశ్వవిద్యాలయ ఆచార్యులు అడప సత్యనారాయణ మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లా ఆర్థిక మరియు సామాజిక వ్యవస్థ అనే అంశంపై మాట్లాడుతూ, గత సామాజిక రుగ్మతలను, ఆ కాలంలో నాటి జోగిని వ్యవస్థ గురించి, కులవివక్ష, బానిసత్వం గురించి మరియు కుష్టి వ్యాధి నిర్మూలమున కోసం డిచ్పల్లి లోని సీఎంసి నిర్మించిన ఆరోగ్య కేంద్రం యొక్క ప్రాధాన్యతను వివరించారు.

**దోమకొండ కోట చరిత్ర :**

ఆ తర్వాత దోమకొండ కోట యొక్క చరిత్రను శ్రీ బాబ్జి విద్యార్థులుకు ప్రత్యక్షంగా చూయిస్తూ వివరించడం జరిగింది. ఆనాటి కాలం యొక్క ప్రాధాన్యతను విద్యార్థులు తెలుసుకున్నారు. దోమకొండ కోట ద్వారా చేస్తున్న సేవా కార్యక్రమాలను వివరించారు.
చర్చా వేదికలో భాగంగా పురాతన కాలం నుండి సేకరించిన నాణాలను, మొగులుల కాలం నుండి నిజాం కాలం, బ్రిటిష్ కాలం, వివిధ దేశాల నాణలను మరియు కరెన్సీ నోట్లను విశ్రాంత అధ్యాపకుడు శ్రీ గాధ శంకర్ వివరించాడు.

దక్షిణ ప్రాంగణ ప్రిన్సిపల్ మాట్లాడుతూ, ఇలాంటి కార్యక్రమాలు చేయడం ద్వారా విద్యార్థులకు చరిత్ర తెలిసి గతంలో జరిగిన మంచి చెడులను తెలుసుకొని దేశ భవిష్యత్తుకు కృషి చేయాలన్నారు.
అనంతరం జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు తెలంగాణ యొక్క బోనాల తో నృత్యం ద్వారా ప్రాధాన్యతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా ఆర్కియాలజీ అధ్యాపకులు డాక్టర్ శివానంద్ యాలాల మాట్లాడుతూ, యువత దేశం యొక్క చరిత్ర సంస్కృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత యువత పై ఆధారపడిందన్నారు.

ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం డైరెక్టర్ డాక్టర్ ఆర్ సుధాకర్ గౌడ్, కోడైరెక్టర్ డాక్టర్. బండిల అంజయ్య, డాక్టర్ రాజేశ్వరి, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఎస్ నారాయణ గుప్తా, డాక్టర్ టీ ప్రతిజ్ఞ, దోమకొండ పోర్టు డైరెక్టర్ శ్రీ బాబ్జి, కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విజయ్ కుమార్, ఎస్ఎస్ఆర్ డిగ్రీ కాలేజ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మారయ్య గౌడ్, ఆర్కే డిగ్రీ కాలేజ్ మేనేజింగ్ డైరెక్టర్ జైపాల్ రెడ్డి, గురు గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ మేనేజింగ్ డైరెక్టర్ గురువేందర్ రెడ్డి, మంజీరా కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణ, డైరెక్టర్ సురేష్ గౌడ్, ఎస్ ఎస్ ఆర్ ప్రిన్సిపల్ రవీందర్ గౌడ్, హిస్టరీ అధ్యాపకులు పోతన్న, డాక్టర్ వెంకటరెడ్డి, డాక్టర్ రమేష్ దక్షిణ ప్రాంగణ అధ్యాపకులు డాక్టర్ మోహన్ బాబు, డాక్టర్ సరిత, డాక్టర్ లలిత, డాక్టర్ సునీత, డాక్టర్ యాలాద్రి, విద్యార్థి నాయకులు డాక్టర్ రాహుల్, డాక్టర్ సంతోష్, వివిధ కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.